889) కాంభోజి / రాగమాలిక

ప|| కొండా చూతము రారో కొండొక తిరుమలకొండా|
కొండని యడిగిన వరము లొసగు మాకొండల తిమ్మయ కొండా||

చ|| మేరువు మును స్తుతియింపగను వారిజసంభవుడా|
పేరు కలుగు నవరత్నంబులు బంగారము కల్పతరువూ|
మేరకు మీఱగని నెలవున నారుగ నిడెనొకో యనగా|
ధారుణి బ్రహ్మాండములకు నాధారంబగు మాకొండా||

చ|| గరుడాచలం బనగా శ్రీవేంకటశైలం బనగా|
గిరులకు నేలికె యగు ననంతగిరి దా నీ గిరియనగా|
సిరులాయ జనమగు యంజన శబరి యనెడి నామములూ|
పరగగ నాలుగు యుగముల వెలసిన ప్రబలంబగు మాకొండా||

చ|| పొదలూ సొంపగు నింపుల పూబొదలూ వాసననదులూ|
కొదలూ గల తామరకొలకులపై మెదలుతుమ్మెదలూ|
కడలి మలయానిలు వలపులపస కదళీవనములనూ|
మొదలుగా నెల్లప్పుడు నీ సంపదలు గల మాకొండా||

చ|| జంతువులెల్లను మునులూ సకలమైన దేవతలూ|
జంతువుల యెలగులు వేదసారంబగు హరినుతులూ|
చింతామణులట రాళ్ళెల్లను సిరులనెలవు లా గుహలూ|
సంతతసౌభాగ్యంబుల నొప్పెడు సందడిగల మా కొండా||

చ|| వొకచో బ్రహ్మాదులు మునులును వొకచో నింద్రాదులునూ|
వొకచో భాగవతులు యతులు శ్రుతులు వొకచో చంద్రార్కులు|
వొకచో తీర్థంబులు గిరులును వొకచో యోగీశ్వరులూ|
అకలంకత తనుగోరి తపము సేయనాస లెఱగు మాకొండా||

**********************************************************************************************************



**********************************************************************************************************

చ|| శుకములతో చదువుదురా శుకబ్రహ్మాదులు శ్రుతులూ|
తకదిమ్మని యాడించు మయూరతతిని యోగీశ్వరులూ|
సకల పురాణంబులు విందురు మఱి పికశారికలచే మునులూ|
ప్రకటితముగ నీవిద్యల నొప్పెడు భాగ్యముకల మా కొండా||

చ|| స్వామితీర్థములకును స్వామిపుష్కరణియునూ|
పామరులా యమరుల జేయును పాపవినాశనమూ|
తా మహిగోరిక లిచ్చు కుమారధారయూ పాండవసరసీ|
కామితఫలగాయిని ఆకాశగంగయు గల మాకొండా||

చ|| యిదియె క్షీరాంబుధి యనుచు మరి యిదియె ద్వారక యనుచు|
యిదియె నందవ్రజ మనుచును మఱి యిది దా నయోధ్య యనుచూ|
యిదియె వైకుంఠం బనుచును యిది పరతత్వంబనుచు|
యిదియె పరమపదం బనుచు వేదములు యెన్నగగల మా కొండా||

చ|| తలచిన శుకశౌనకాదులకు తలచిన తలపొసగినా|
తలపులోపల నెలకొన్నా దయతో నన్నేలినా|
చెలువుడు మావేంకటరాయడు సిరులనెలవు చేకొన్నా|
కలియుగవైకుతంబను నామము గలిగివెలయు మాకొండా||